కథ

# షరతులు వర్తిస్తాయి!

పంతుల జోగారావు

**మంచి సంబంధం. కట్నాల ఊసు లేదు. పిల్ల నచ్చింది. రెండ్రోజుల్లో మళ్ళీ మూఢాలు వస్తాయి. కనుక, రేపే తాంబూలాలు మార్చుకుందాం అని వియ్యాల వారి నుంచి ఫోను.**

ఆ యింట్లో అందరూ సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బియి పోయేరు. 'మా సునంద అదృష్టవంతురాలు' తల్లి సరస్వతమ్మ యీ మాట అప్పటికి ఏ వందోసారో అనడం జరిగింది. కూతురి అదృష్టానికి నారాయణ కూడా ఎంతగానో పొంగిపోయేరు. వియ్యంకుల వారినుంచి ఫోన్ వచ్చి నప్పటి నుంచి, ఆ దంపతులకి కాలు ఒక చోట నిలవడం లేదు. చుట్ట పక్కాలకి ఉదయం నుంచి ఫోన్లు చేస్తూ ఆ శుభవార్త అందజేస్తూనే ఉన్నారు. ఇరుగు పొరుగులకీ, ఊళ్ళో స్నేహితులకి ఆ వార్త చేరవేసారు. మరోపక్క తాంబూలాలు యిచ్చుకుందుకి అట్టే వ్యవధిలేక పోవడంతో వాళ్ళకి క్షణక్షణానికీ కంగారు పెరిగిపోతోంది. పీకల మీదకి యీ మూఢాలొకటి వచ్చి పడుతున్నాయి. ఏం చెయ్యాలో తోచడం లేదు. ఓ పక్క వియ్యాలవారు మూఢాలు రాకుండానే తాంబూలాలు తీసుకుందామని తొందరపెడుతూ ఉంటే, వ్యవధి కావాలని అడిగే సాహసం ఆ దంపతులకి లేక పోయింది.

ఈ సంబంధానికి సునంద తన సుముఖత ముందే తెలియజేసింది. అయితే, యింత అవ్యవధానంగా నిశ్చయ తాంబూలాలు తీసుకోవడం ఆమెకి నచ్చడం లేదు. 'మరోసారి వాళ్ళతో మాట్లాడ రాదూ, నాన్నా' అంది. కూతురి మాటలతో మళ్ళీ వియ్యంకుడికి ఆ విషయమ్మై ఫోన్ చేశారు నారాయణ.

"అబ్బే, అనుకున్నాక మరి ఆలస్యం ఎందుకు బావగారు! మూఢాలు రాకుండానే ఆ తంతు జరిపించేద్దాం... మాట్లాడుకోడానికి మరేం లేదు కదా? అదీకాక, మా వాడికి అట్టే సెలవు కూడా లేదు. తాంబూలాల కార్యక్రమం చాలా సింపుల్‌గా జరిపించేద్దాం... కాదనకండి...." అని జవాబొచ్చింది.

మరి చేసేదేముంది కనక? హడావిడిగా పనులకి సిద్ధమయ్యారు నారాయణ దంపతులు.

కట్నం ప్రసక్తిలేని సంబంధం వొచ్చినందుకు సునంద ఎంతగానో సంతోషించింది. అమ్మాయి ఉద్యోగం చేసి సంపాదిస్తున్నా కట్నం పేరిట వేధించే వ్యక్తులున్న యీరోజుల్లో కట్నం ఊసెత్తని వారి సంస్కారానికి పొంగిపోయింది. ఆ రోజంతా హడావిడిగా షాపింగ్ పూర్తిచేసి, బట్టలూ, స్వీట్లూ అవీ కొని మర్నాడు నిర్వహించబోయే కార్యక్రమానికి బిజీబిజీ అయిపోయేరు నారాయణ దంపతులు. వియ్యాల వారిదీ అదే ఊరు కావడం చేత, కొంత నయం. ప్రయాణ హడావిడి లేదు. దగ్గరి వాళ్ళకి ఫోన్లు చేసి కార్యక్రమానికి ఆహ్వానించేరు.

మర్నాడు నిశ్చయ తాంబూలాల కార్యక్రమం నిరాడంబరంగానే అయినా, ఎంతో ఉల్లాసంగా జరిగింది. కొద్దిపాటి మంది బంధువులూ, స్నేహి



తులూ హాజరై దీవించేరు. ఫొటోలూ, వీడియోలు షరా మామూలే.

మూఢం వెళ్ళేక పెళ్ళి ముహూర్తాలు పెట్టకుందాం అని అనుకున్నారు. వియ్యాల వారు వెళ్ళి పోయేక ఆ రాత్రంతా సరదా కబుర్లతోనే గడిచిపోయింది.

పైసా కట్నం లేని సంబంధం కూతురికి కుదర్చ గలిగినందుకు నారాయణ గర్వించని క్షణం లేదు.

'అదృష్టవంతుడివయ్యా!' అని పొగిడేరు వచ్చిన వాళ్ళంతా.

***

'అదృష్టవంతుడినే' అనుకున్నాడు నారాయణ.

'అదృష్టవంతులమే' అనుకుంది సరస్వతమ్మ.

కాని, ఆ సంతోషం అట్టేరోజులు మిగల్లేదు వాళ్ళకి. వాళ్ళ గుండెల్లో రైళ్ళు పరిగెట్టించే సంఘటనలు తర్వాతి రోజులలో చాలానే జరిగాయి.

మూఢాలు వెళ్ళాక పెళ్ళిముహూర్తాలు పెట్టుకున్నది లగాయతు. వాళ్ళ ఆనందం అడుగంటి పోసాగింది. వియ్యాల వారి నుంచి రోజుకో ఫోను. పూటకో బెత్తాయింపు. కట్నం లేదు కనుక, పెళ్ళి మాత్రం ఆ పట్నంలో కెల్లా అత్యంత విలాసవంతమైన హోటల్లో జరిపించాలని హుకుం జారీ చేశారు. తమ తరపు వాళ్ళెవరి దగ్గరా చిన్నబోకుండా పెట్టుపోతలూ అవీ జరిపించాలని తేల్చి చెప్పారు. ఆ బట్టల ఖరీదులూ, వివరాలు విని నారాయణ దంపతుల గుండె జారిపోయింది. ఇక, పెళ్ళి కూతురికి పెట్టవలసిన నగల గురించి విన్నాక వారికి మూర్ఛవచ్చినంత పనైంది. కళ్ళు బైర్లు కమ్మాయి. సారె సామాన్ల జాబితా, విందుభోజనాలలో మెనూ, పెళ్ళయ్యాక దంపతుల హనీమూన్ ట్రిప్‌కి చేయాల్సిన యేర్పాట్లు – ఇవన్నీ క్రమేపీ ఒక్కొక్కటీ వింటూ వాళ్ళ మెదళ్ళు మొద్దుబారి పోయేయి.

వియ్యాల వారి నుంచి ఫోన్ వచ్చిందంటే చాలు – ఆ దంపతులకి ముచ్చెమటలు పడుతున్నాయి.

కట్నం లేదన్న మాటే కానీ, ఆ గొంతెమ్మ కోరికలకి అంతూ పొంతూ లేకుండా పోతోంది. ట్రింగ్ ట్రింగ్ అనే ఫోను శబ్దం వాళ్ళ గొంతు తడారి పోయేలా చేస్తోంది.

కట్నం తీసుకోకుండా సంబంధం కుదుర్చుకున్న కీర్తి, వియ్యాలవారికి దక్కొచ్చు గాక! ఈ పెళ్ళి ఆర్భాటాలతో తాము కుదేలై పోవడం ఖాయమని జావ కారిపోతున్నారు నారాయణ దంపతులు.

సునంద మగ పెళ్ళి వారి ఒక్కోకోరికా విన్నప్పుడల్లా కోపంతో చిందులు తొక్కుతోంది. ఒక దశలో సంబంధం కేన్సిలు చేసెయ్యమని తెగేసి చెప్పింది కూడా.

అంతవరకూ వచ్చేక ఆ సంబంధం ఎలా కాదనుకోవడమో అర్థం కాలేదు ఆ దంపతులకి. అదీ కాక మంచి సంబంధం. అల్లుడు మంచి ఉద్యోగంలో ఉన్నాడు. మనిషి యోగ్యుడిలాగా ఉన్నాడు. అతడికీ భోగట్టాలేం తెలీదేమో! అయితే, అప్పుడు ఇలా గుంటే, రేపు పెళ్ళిలో ఇంకెంత రాద్ధాంత మౌతుందో, తమ తలకి మించిన కోరికలు ఇంకేం కోరతారో? అనే బెంగ కూడా పట్టి పీడిస్తోంది.

కష్టమో నష్టమో యీ పెళ్ళి కానిచ్చేస్తే – ఆ తర్వాత అంతా సర్దుకుపోవచ్చు. పెళ్ళి ఆడంబరంగా జరిపించాలన్న వారి కోరికలో తప్పులేక పోవచ్చు. కానీ ఆ సంగతి ముందే చెప్తే వారి ముందు తన తాహతేమిటో వివరించే వాడు కదా. అంతగా తను వారితో తూగలేడనుకుంటే ఆ సంగతి ముందే చెప్పి ఉండేవాడు.

గొప్పగా మాట్లాడుకోడానికేమి లేదని చెప్పి, తాంబూలాలకి తొందర పెట్టేసి, తీరా ఇప్పుడీ గొంతెమ్మ కోరికలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.

వీళ్ళ ఆరాటం గమనించి, ఆ కుటుంబ స్నేహితుడొకాయన వచ్చి ఓదార్చేడు. 'కొందరంతే... అన్నీ ఉచితం అని ప్రకటనలిచ్చి, చివర్లో ఎక్కడో కనీ కనిపించని అక్షరాల్లో షరతులు వర్తిస్తాయి అని రాస్తారు చూడండి... అలాగన్నమాట. అలాగే పైకి సంస్కారం ప్రకటించి, తర్వాత వాళ్ళనుకున్న వన్నీ సాధిస్తారు... సరే... అప్పోసప్పో చేసి, సునంద పెళ్ళి కానిచ్చెయ్యండి. అంతకన్నా మరో మార్గం లేదు. అన్నీ సర్దుకుంటాయి.... పెద్దవాడ్ని చెబుతున్నాను... నా మాట వినండి... మరేం ఆలోచించకండి'' అని హితవు చెప్పాడు. సునంద అయిష్టంగానే అంగీకరించింది. నారాయణ, సరస్వతమ్మలకు మరో మాట అనడానికి తోచలేదు.

***

పెళ్ళి మహా ఆడంబరంగా జరిగింది. చిన్నాచితకా తప్ప మరేం కొత్త కోరికలు కోరలేదు పెళ్ళి వాళ్ళు. ఆ మేరకు అదో తృప్తి!

ఆ పెళ్ళితో – ఒక్కపైసా కట్నం లేకుండా కూతురి పెళ్ళి చేయగలిగిన ఆ అదృష్టవంతులకి –పుట్టెడు అప్పు తెలీని అసంతృప్తి మిగిలిపోయేయి. సునంద అత్తవారింటికి వెళ్ళిపోయింది. త్వరలోనే అందరితో బాగా కలిసి పోయింది.

పదహార్రోజుల పండుగ పూర్తయ్యేక, సెలవు ముగించుకుని, సునంద మళ్ళీ ఉద్యోగంలో చేరి పోయింది. రోజులు గడుస్తున్నాయి.

నాలుగు నెలలయింది. సునంద తన జీతం ఏం చేస్తోందో తెలీదు. అత్తవారింట్లో ఎవరికీ ఒక్క రూపాయి యివ్వడం లేదు. ఆ ఇంట్లో అంతా మనసుల్లోనే కుతకుతలాడి పోతున్నారు. సంస్కారపు తెర అడ్డొచ్చి, ఎవరూ నోరు మెదపడం లేదు.

ఆఖరికి ఉండబట్టలేక, భర్తే ఓ రోజు సునందని జీతం గురించి మెల్లగా కదిపేడు.

సునంద ప్రశాంతంగా బదులిచ్చింది: ''పెళ్ళయ్యాక ఉద్యోగం చెయ్యాలనీ, మానొద్దనీ అన్నారు కదా?''

''అవును... అయితే...''

''అందుకే ఉద్యోగం మానలేదు. ఉద్యోగం చెయ్యమన్నారే కానీ, జీతం మీకిమ్మని ముందే కండిషను పెట్టలేదు కదండీ?''

సునంద మాటలతో ఆ ఇంట్లో అందరూ నిర్ఘాంత పోయేరు.

వాళ్ళకి కోపం తన్నుకొచ్చినా ఎలా వ్యక్తం చెయ్యాలో తెలీక మిన్నకుండి పోయేరు.

ఆ విస్ఫోటనం మరింత పెద్దది చెయ్యడం ఇష్టం లేక సునంద మళ్ళీ అంది: ''ఈ పరిస్థితులు కొంత కాలమే లెండి... మా నాన్న మన పెళ్ళికి చేసిన అప్పు తీరే వరకూ ... ప్లీజ్... అర్థం చేసుకోండి...''

కట్న ప్రసక్తి లేకుండా కోడల్ని తెచ్చుకున్న వారిగా అందరి మెప్పు పొందిన ఆ యింట్లో ఎవరికీ ఆ మాటలతో మరింక నోళ్ళు పెగల్లేదు. ఎంతైనా వారిది సంస్కారవంతుల కుటుంబం కదా?!

*

**చిరునామా:**
**పంతుల జోగారావు,**
**ఇంటి నెం. 15,**
**ఆపోజిట్: సాధనా మందిర్ బస్ స్టాప్,**
**రిసాలబజార్, సికింద్రాబాద్-10**
**సెల్: 94901 39622.**



## ప్రియాంకచోప్రానే నాకు పోటీ: నమిత

ప్రియాంక చోప్రా ఉత్తరాది భామ అయితే, నమిత దక్షిణాది భామ. ఉత్తర, దక్షిణాలకు పోటీ ఏమిటి? అని ఆశ్చర్యపోకండి. ప్రియాంకచోప్రా తనకు పోటీ అని ఇటీవల నమితే స్వయంగా అంగీకరించింది. దానికి సంబంధించి ఓ పిట్ట కథ కూడా చెప్పుకొచ్చింది. నమిత, ప్రియాంక ఇద్దరూ కొన్ని సంవత్సరాల క్రితం అందాల పోటీలకు హాజరయ్యారట! నమిత క్వాలిఫైయింగ్ రౌండ్ వరకూ వెళ్లి అక్కడ నుంచి వెనుతిరిగిందట! కేవలం తనకు ఇంగ్లీష్ రాకపోవడం వలనే ఇంటిబాట పట్టవలసి వచ్చిందని నమిత ఇప్పుడు తీరిగ్గా బాధపడుతోంది. నా తరువాత ప్రియాంక చోప్రా అక్కడ విన్నర్ అయింది. ఆ ఎక్స్‌పీరియన్స్‌తో ఆ తరువాత పట్టుబట్టి తాను ఇంగ్లీష్ నేర్చుకున్నానని నమిత చెప్పుకొచ్చింది. 'మిస్‌వరల్డ్' మిస్ అయినా, కోట్లాది మంది అభిమానుల గుండెల్లో స్థానం దొరికిందని సరిపెట్టుకుంటోంది. అదీ సంగతి!